29 రబీయుల్ అవ్వల్ 1448 హిజ్రీ (సెప్టెంబర్ 11, 2026)

# పిల్లల పెంపకం

ఇన్నల్-హమ్ద లిల్లాహి, నహ్మదుహూ వనస్తఈనుహూ వనస్తగ్ఫిరుహ్, వనఊథు బిల్లాహి మిన్ షురూరి అన్ఫుసినా వమిన్ సయ్యిఆతి అఅ్మాలినా, మన్ యహ్దిహిల్-లాహు ఫలా ముదిల్ల లహూ, వమన్ యుద్లిల్ ఫలా హాదియ లహూ, వఅష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్-లాహు వహ్దహూ లా షరీక లహూ, వఅష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహూ, వసఫియ్యుహూ మిన్ ఖల్ఖిహీ వఖలీలుహూ, అద్దా అల్-అమానత, వబల్లఘ అర్-రిసాలత, వజాహద ఫిల్-లాహి హక్క జిహాదిహీ, హత్తా అతాహుల్-యఖీన్, సల్లల్-లాహు అలైహి వఅలా ఆలిహి వసహ్బిహీ వసల్లమ తస్లీమన్ కసీరా;

యా అయ్యుహల్-లధీన ఆమనుత్తఖుల్-లాహ హక్క తుఖాతెహీ వలా తమూతున్న ఇల్లా వఅన్తుమ్ ముస్లిమూన్ [ఆల్-ఇమ్రాన్: 102].

**అమ్మా బఅద్:**

నిశ్చయంగా, అత్యంత సత్యమైన మాట అల్లాహ్ గ్రంథం (ఖురాన్). అత్యుత్తమ మార్గదర్శకత్వం ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గదర్శకత్వం. విషయాలలో అత్యంత చెడ్డవి క్రొత్తగా కల్పించబడినవి. క్రొత్తగా కల్పించబడిన ప్రతి విషయమూ బిద్అత్, ప్రతి బిద్అత్ మార్గభ్రష్టత్వం, ప్రతి మార్గభ్రష్టత్వం నరకంలో ఉంటుంది.

**అల్లాహ్ దాసులారా!**

నిశ్చయంగా సంతానం అనేది అల్లాహ్ ప్రసాదించిన గొప్ప వరం మరియు బహుమతి. అల్లాహ్ తాను కోరిన తన దాసులపై దీనిని అనుగ్రహిస్తాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

{وَاللَّهُ جَعَلَ لَكُمْ مِنْ أَنْفُسِكُمْ أَزْوَاجًا وَجَعَلَ لَكُمْ مِنْ أَزْوَاجِكُمْ بَنِينَ وَحَفَدَةً وَرَزَقَكُمْ مِنَ الطَّيِّبَاتِ} [النحل: 72]

అల్లాహ్ మీకోసం మీ జాతినుండి స్త్రీలను సృష్టించాడు. ఆయనే ఆ స్త్రీలద్వారా మీకు కొడుకులు, మనవళ్ళను ప్రసాదిస్తున్నాడు. అంతేకాకుండా తినడానికి కూడా మీకు ఎన్నో మంచి మంచి పదార్థాలు ఇస్తున్నాడు. [అన్-నహ్ల్: 72].

కాబట్టి పిల్లలు ఈ జీవితపు అలంకారం మరియు దాని ఆనందం, అత్యంత గొప్ప మరియు విలువైన బహుమతులు. వారి సత్ప్రవర్తనతో కళ్ళకు చల్లదనం, మనసుకు శాంతి, హృదయానికి ఆనందం కలుగుతాయి. అందుకే కరుణామయుని దాసుల ప్రార్థనలలో ఇది ఒకటి:

{رَبَّنَا هَبْ لَنَا مِنْ أَزْوَاجِنَا وَذُرِّيَّاتِنَا قُرَّةَ أَعْيُنٍ وَاجْعَلْنَا لِلْمُتَّقِينَ إِمَامًا} [الفرقان: 74]

{మా ప్రభువా! మా భార్యల ద్వారా మరియు మా సంతానం ద్వారా మా కళ్ళకు చల్లదనాన్ని ప్రసాదించు మరియు మమ్మల్ని దైవభీతి గలవారికి నాయకులుగా చేయుము} [అల్-పుర్ఖాన్: 74].

కాబట్టి అల్లాహ్ తన దాసుడికి ప్రసాదించే పరిపూర్ణమైన అనుగ్రహాలలో ఒకటి, అతని రేతస్సు నుండి  అల్లాహ్ ఒక్కడినే ఎలాంటి భాగస్వామి లేకుండా ఆరాధించేవారు ఉద్భవించడం. తన సంతానం తన కళ్ళ ముందే నమాజ్ చేయడం, తన సమక్షంలో ఖురాన్ ఆయతులను పఠించడం చూసి అతను ఆనందంతో మునిగిపోతాడు, సంతోషం అతన్ని చుట్టుముడుతుంది. కాబట్టి పిల్లల సదాచార ప్రవర్తన అనేది ఎంతో విలువైన లక్ష్యం మరియు 'అల్-లతీఫ్ అల్-ఖబీర్' (సూక్ష్మదర్శి, సర్వజ్ఞుడు) అయిన అల్లాహ్ నుండి లభించే గొప్ప సౌభాగ్యం.

**విశ్వాసులారా!**

నిశ్చయంగా పిల్లల పెంపకం అనేది ఒక గొప్ప బాధ్యత, కర్తవ్యం. ముఖ్యంగా మనం ఈ ఆధునిక కాలంలో ఎదుర్కొంటున్న ఈ సవాళ్ల నీడలో ఇది మరింత ముఖ్యం. ఎందుకంటే సత్ప్రవర్తనతో కూడిన పెంపకానికి ఓర్పు, వివేకం, పరిణతి మరియు నైపుణ్యం అవసరం. నేడు పిల్లల పెంపకం నిన్నటిలా లేదు; సాధనాలు మారిపోయాయి, ప్రభావాలు పెరిగిపోయాయి, సవాళ్లు వేగవంతమయ్యాయి. నేడు పిల్లవాడు ఒక బహిరంగ ప్రపంచంలో జీవిస్తున్నాడు; తన తల్లిదండ్రుల నుండి వినేదానికంటే, లేదా తన ఉపాధ్యాయుల నుండి నేర్చుకునేదానికంటే ఎక్కువగా ఈ సాధనాల ద్వారా వింటున్నాడు, చూస్తున్నాడు మరియు ప్రభావితమవుతున్నాడు.

కాబట్టి నేటి పిల్లల పెంపకం అనేది ఒక దైనందిన జిహాద్ (పోరాటం) మరియు నిరంతర ఓర్పు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

{يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا قُوا أَنْفُسَكُمْ وَأَهْلِيكُمْ نَارًا وَقُودُهَا النَّاسُ وَالْحِجَارَةُ} [التَّحْرِيم:6]

విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీభార్యాపిల్లల్ని నరకాగ్ని నుండి రక్షించుకోండి. దానికి మానవులు, రాళ్ళు సమిధలవుతారు. [అత్-తహ్రీమ్: 6].

ఇమామ్ ఇబ్న్ కసీర్ (రహిమహుల్లాహ్) అన్నారు: అనగా, వారికి మంచిని ఆదేశించండి, చెడును నివారించండి, మరియు వారిని నిర్లక్ష్యంగా వదిలివేయకండి; లేకపోతే ప్రళయ దినాన అగ్ని వారిని దహించివేస్తుంది.

**ఓ శుభాత్ములారా!**

సవాళ్ల కాలంలో పిల్లల పెంపకానికి తోడ్పడే అత్యంత గొప్ప మార్గాలలో ఒకటి: వారి పసిప్రాయం నుండే వారి హృదయాలలో విశ్వాసాన్ని నాటడం. ఎందుకంటే హృదయం విశ్వాసంతో నిండినప్పుడు అవయవాలు సరైన మార్గంలో నడుస్తాయి, ప్రవర్తన మెరుగుపడుతుంది, మరియు పిల్లవాడు స్వయంగా దైవభీతిని (ఎల్లప్పుడూ అల్లాహ్ తనను గమనిస్తున్నాడనే భావనను) అనుభూతి చెందుతాడు. దాంతో పర్యవేక్షకుడు లేకపోయినా అతను సరైన మార్గంలోనే స్థిరంగా ఉంటాడు.

ఇబ్న్ అబ్బాస్ (రదియల్లాహు అన్హుమా) ఉల్లేఖించారు: "నేను ఒకరోజు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వెనుక సవారీపై ఉన్నాను. అప్పుడు వారు ఇలా అన్నారు:

»يَا غُلَامُ، إِنِّي أُعَلِّمُكَ كَلِمَاتٍ، احْفَظِ اللَّهَ يَحْفَظْكَ، احْفَظِ اللَّهَ تَجِدْهُ تُجَاهَكَ، إِذَا سَأَلْتَ فَاسْأَلِ اللَّهَ، وَإِذَا اسْتَعَنْتَ فَاسْأَنهِ بِاللَّهِ، وَاعْلَمْ أَنَّ الْأُمَّةَ لَوِ اجْتَمَعَتْ عَلَى أَنْ يَنْفَعُوكَ بِشَيْءٍ لَمْ يَنْفَعُوكَ إِلَّا بِشَيْءٍ قَدْ كَتَبَهُ اللَّهُ لَكَ، وَلَوِ اجْتَمَعُوا عَلَى أَنْ يَضُرُّوكَ بِشَيْءٍ لَمْ يَضُرُّوكَ إِلَّا بِشَيْءٍ قَدْ كَتَبَهُ اللَّهُ عَلَيْكَ، رُفِعَتِ الْأَقْلَامُ وَجَفَّتِ الصُّحُفُ«

(ఓ బాలుడా! నేను నీకు కొన్ని మాటలు నేర్పుతాను: అల్లాహ్ (ఆదేశాలను, హద్దులను) సంరక్షించు, ఆయన నిన్ను కాపాడుతాడు. అల్లాహ్ (హద్దులను) సంరక్షించు, ఆయనను నీ ముందే కనుగొంటావు. నువ్వు అడిగితే అల్లాహ్నే అడుగు, సాయం కోరితే అల్లాహ్ నుండే సాయం కోరు. నిశ్చయంగా, ఒకవేళ ప్రజలందరూ నీకు ఏదైనా మేలు చేయాలని ఏకమైనా, అల్లాహ్ నీ భాగ్యంగా వ్రాసిన మేలు తప్ప మరేమీ చేయలేరు. అలాగే నిశ్చయంగా వారు నీకు ఏదైనా కీడు తలపెట్టాలని ఏకమైనా, అల్లాహ్ నీపై వ్రాసిన కీడు తప్ప మరేమీ చేయలేరు. కలములు ఎత్తబడ్డాయి, వ్రాసే ప్రతులు ఎండిపోయాయి) [దీనిని తిర్మిజీ ఉల్లేఖించి సహీహ్ అన్నారు]."

**విశ్వాసులారా!**

కొడుకులు మరియు కుమార్తెల పెంపకంలో ఉపయోగపడే మరో ప్రయోజనకరమైన మార్గం ఏమిటంటే: ఆజ్ఞలను పాటించడంలో మరియు నిషేధాలు, దూరంగా ఉండవలసిన విషయాల పట్ల వారిని చిన్నప్పటి నుంచే అలవాటు చేయడం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

{وَأْمُرْ أَهْلَكَ بِالصَّلَاةِ وَاصْطَبِرْ عَلَيْهَا لَا نَسْأَلُكَ رِزْقًا نَحْنُ نَرْزُقُكَ وَالْعَاقِبَةُ لِلتَّقْوَى} [طه: 132]

నీ భార్యాపిల్లలకు నమాజును గురించి బోధించు. నీవు కూడా దాన్ని క్రమం తప్పక ఆచరించు. మేము మిమ్మల్ని ఆహారం ఇవ్వమని అడగటం లేదు. మేమే మీకు ఆహారం ప్రసాదిస్తున్నాం. సత్ఫలం దైవభీతిపరాయణతకే లభిస్తుంది. [తాహా: 132].

మరియు తన కుమారునికి, హితబోధ చేస్తూ లుఖ్మాన్ (అలైహిస్సలామ్) పలికిన మాటలను అల్లాహ్ ఇలా ఉదహరించాడు:

{يَابُنَيَّ أَقِمِ الصَّلَاةَ وَأْمُرْ بِالْمَعْرُوفِ وَانْهَ عَنِ الْمُنْكَرِ وَاصْبِرْ عَلَى مَا أَصَابَكَ إِنَّ ذَلِكَ مِنْ عَزْمِ الْأُمُورِ} [لقمان: 17]

(ఓ నా కుమారుడా! నమాజును స్థాపించు, మంచిని ఆదేశించు, చెడును నివారించు మరియు నీకు వాటిల్లే కష్టాలను ఓపికతో భరించు. నిశ్చయంగా ఇవి ఎంతో ధైర్యంతో కూడిన పనులు) [లుఖ్మాన్: 17].

మరియు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రదియల్లాహు అన్హుమా) ఉల్లేఖించారు: ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు:

«مُرُوا أَوْلَادَكُمْ بِالصَّلَاةِ وَهُمْ أَبْنَاءُ سَبْعِ سِنِينَ، وَاضْرِبُوهُمْ عَلَيْهَا وَهُمْ أَبْنَاءُ عَشْرٍ، وَفَرِّقُوا بَيْنَهُمْ فِي الْمَضَاجِعِ»

(మీ పిల్లలకు ఏడేళ్ల వయస్సు వచ్చినప్పుడే నమాజ్ చేయమని ఆదేశించండి. వారికి పదేళ్ల వయస్సు వచ్చినప్పుడు (నమాజ్ చేయనందుకు) వారిని మందలించండి (లేదా దండించండి), మరియు వారి పడకలను వేరు చేయండి) [దీనిని అబూ దావూద్ మరియు తిర్మిజీ ఉల్లేఖించి సహీహ్ అన్నారు].

అంతేకాదు, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చిన్నపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. మరియు వారి బాగోగులను ఆరా తీసేవారు. వారితో వారి పద్ధతి ఎంతో శ్రద్ధతో, సౌమ్యతతో మరియు దయతో కూడిన పెంపకంపై ఆధారపడి ఉండేది. చిన్నారి నమాజ్ గురించి వారు స్వయంగా ఆరా తీసేవారు; తద్వారా ఆరాధన

యొక్క ప్రాముఖ్యతను ఆ చిన్నారి హృదయంలో నాటడానికి, దానికి అలవాటు చేయడానికి మరియు అల్లాహ్ తో అతనికి గల సంబంధాన్ని బలపరచడానికి ఆయన అలా చేసేవారు.

ఇబ్న్ అబ్బాస్ (రదియల్లాహు అన్హుమా) ఉల్లేఖించారు: "నేను నా పిన్ని మైమూనా (రదియల్లాహు అన్హా) గారి ఇంట్లో రాత్రి బస చేశాను. చీకటి పడిన తర్వాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అక్కడికి వచ్చి ఇలా అడిగారు:

»أَصَلَّى الْغُلَامُ؟«

(బాలుడు నమాజ్ చేశాడా?)

అందుకు వారు: 'అవును' అని బదులిచ్చారు" [దీనిని అబూ దావూద్ ఉల్లేఖించి, అల్బానీ సహీహ్ అన్నారు].

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధనలు కేవలం బాహ్య ఆరాధనలకే పరిమితం కాలేదు, హార పానీయాలు తినే, త్రాగేటప్పుడు పాటించే సూక్ష్మమైన మర్యాదలు మరియు ప్రవర్తనా నియమావళి వరకు విస్తరించాయి. ఉమర్ బిన్ అబీ సలమః (రదియల్లాహు అన్హుమా) ఉల్లేఖించారు: "నేను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సంరక్షణలో ఉన్న ఒక చిన్న బాలుడిని. (ఒకసారి భోజనం చేసేటప్పుడు) నా చేయి గిన్నెలో నలుమూలలా తిరుగుతుండేది. అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో ఇలా అన్నారు:

»يَا غُلَامُ، سَمِّ اللَّهَ، وَكُلْ بِيَمِينِكَ، وَكُلْ مِمَّا يَلِيكَ«

(బాబూ! బిస్మిల్లాహ్ చెప్పు, నీ కుడి చేతితో తిను మరియు నీకు దగ్గరగా ఉన్న దాని నుండి తిను). ఆ తర్వాత అదే నా భోజనపు పద్ధతిగా మారిపోయింది" [దీనిని బుఖారీ మరియు ముస్లిం ఉల్లేఖించారు].

**ఓ ముస్లింలారా!**

మన కాలంలో పెంపకాన్ని నాశనం చేసిన అత్యంత ప్రమాదకరమైన మాటలలో ఒకటి – కొందరు  అనే మాట: "అతన్ని వదిలేయండి, అతను చిన్నవాడు". ఇది తప్పులను సమర్థించే, మార్గదర్శకత్వపు వెలుతును ఆర్పివేసే మరియు నిర్లక్ష్యపు తలుపులు తెరిచే అత్యంత ప్రమాదపూరిత మాట. దీనివల్ల కొడుకు తాను ఇష్టపడిన పనులు చేస్తాడు, ఎవరూ అతన్ని మందలించరు; కూతురు తాను కోరిన వస్త్రాలు ధరిస్తుంది, ఎవరూ దాన్ని వ్యతిరేకించరు. చివరికి ఆ తరం తప్పులతోనే పెరుగుతుంది, నిర్లక్ష్యానికి అలవాటుపడుతుంది మరియు ఎవరు

ఏమి చెప్పినా పట్టించుకోదు. ఎవరినైతే చిన్నతనంలో చక్కగా పెంచడం జరుగుతుందో, పెద్దయ్యాక వారి జీవితం పుష్పిస్తుంది. గొప్పగా ఫలిస్తుంది.

అబూ హురైరా (రదియల్లాహు అన్హు) ఉల్లేఖించారు: "హసన్ బిన్ అలీ (రదియల్లాహు అన్హుమా) (దానధర్మాల కొరకు వచ్చిన) సదకా ఖర్జూరాలలో ఒక ఖర్జూరాన్ని తీసుకుని తన నోట్లో వేసుకున్నారు. అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దానిని ఉమ్మివేయమని కోరుతూ: «كِخْ كِخْ» (కిఖ్ కిఖ్ – పిల్లలను ఏవగించుకోవడానికి లేదా ఆపడానికి పలికే శబ్దం) అన్నారు. ఆ తర్వాత: 'మనం సదకా (దానధర్మం) తినము అని నీకు తెలియదా?' అని చెప్పారు" [దీనిని బుఖారీ ఉల్లేఖించారు].

ఇబ్న్ అల్ –ఖయ్యిమ్ (రహిమహుల్లాహ్) అన్నారు: "(ఎవరైతే తన సంతానానికి ప్రయోజనం చేకూర్చే విషయాలను నేర్పించకుండా నిర్లక్ష్యం చేస్తాడో మరియు వారిని గాలికొదిలేస్తాడో, అతను వారికి అత్యంత తీవ్రమైన ద్రోహం చేసినవాడవుతాడు. చాలామంది పిల్లలు చెడిపోవడానికి ప్రధాన కారణం తండ్రుల నిర్లక్ష్యమే; వారు తమ పిల్లలకు ధార్మిక విధివిధానాలను (ఫరాయిద్) మరియు సున్నతులను నేర్పించడంలో విఫలమై చిన్నతనంలోనే వారిని పడద్రోశారు. దాంతో వారు పెద్దయ్యాక తమకు తాముగా ప్రయోజనం పొందలేకపోయారు, తమ తండ్రులకు కూడా ఏమాత్రం ఉపయోగ పడలేకపోయారు)."

**సత్ప్రవర్తన అనేది మొక్కలా మొలకెత్తుతుంది...**

**సదాచారాలనే నీటితో అది తడిసినప్పుడు,**

**పోషణకర్త  దానిని సంరక్షించినప్పుడు...**

**అది పుణ్యమనే కాండంపై ఫలాలను ఇస్తుంది.**

అల్లాహ్ నాకు, మీకు మహోన్నతమైన ఖురాన్ ద్వారా శుభాన్ని ప్రసాదించుగాక! మరియు అందులోని ఆయతులు, విజ్ఞానభరితమైన హితబోధల ద్వారా నాకు, మీకు ప్రయోజనం చేకూర్చుగాక! నేను ఈ మాటలు పలుకుతూ నా కొరకు, మీ కొరకు సకల పాపాల నుండి అల్లాహ్ క్షమాపణ వేడుకుం టున్నాను మరియు ఆయన వైపే పశ్చాత్తాపపడుతున్నాను. కాబట్టి మీరు కూడా ఆయనను క్షమాపణ వేడుకోండి మరియు ఆయన వైపే పశ్చాత్తాపపడండి; నిశ్చయంగా ఆయన అత్యంత క్షమాశీలుడు, దయామయుడు.

## రెండవ ఖుత్బా

అల్-హందు లిల్లాహి అల ఇహ్సానిహి, వష్-శుక్రు లహు అలా తౌఫీకిహి వ-ఇమ్తినానిహి, వస్-సలాతు వస్-సలాము అలాద్-దాఈ ఇలా రిద్వానిహి, ముహమ్మదిబ్ని అబ్దిల్లాహి, వ అలా ఆలిహి వ సహ్బిహి, వ మన్ సారా అలా మిన్వాలిహి ఇలా యౌమిద్-దీన్.

**అమ్మా బాద్:**

అల్లాహ్ దాసులారా! అల్లాహ్ పట్ల నిజమైన దైవభీతిని కలిగి ఉండండి, గోప్యంగానూ మరియు బహిరంగంగాగానూ ఆయన పట్ల భయభక్తులు కలిగి ఉండండి; మరియు నిశ్చయంగా మీరందరూ ఆయన వైపుకే సమీకరించబడతారని తెలుసుకోండి.

**ముస్లింలారా!**

నిశ్చయంగా పిల్లల పెంపకంలో తోడ్పడే అత్యంత ప్రభావవంతమైన సాధనాలలో ఒకటి: మంచి ఆదర్శం. ఇది మాటలు లేకుండా జరిగే పెంపకం, ఇది పిల్లల మనసులపై నిశ్శబ్దంగా తన ప్రభావాన్ని చూపుతుంది. దాంతో పిల్లవాడు తాను చూసే సత్ప్రవర్తన మరియు ఉత్తమమైన నమూనా ద్వారా ప్రభావితమై ఎదుగుతాడు. కాబట్టి పిల్లల ప్రవర్తనలో వ్యతిగతత మరియు అశాంతిని కలిగించే అత్యంత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే: మాటలకు మరియు చేతలకు మధ్య అతను చూసే వ్యత్యాసం. అల్లాహ్ తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తో తనకు పూర్వం గడిచిన ప్రవక్తలను, సందేశహరులను ఆదర్శంగా తీసుకోవాలని ఆదేశించాడు. అల్లాహ్ తఆలా ఇలా సెలవిచ్చాడు:

{أُولَئِكَ الَّذِينَ هَدَى اللَّهُ فَبِهُدَاهُمُ اقْتَدِهْ} [الأنعام: 90]

(వారే అల్లాహ్ మార్గదర్శకత్వం పొందినవారు; కాబట్టి వారి మార్గాన్ని అనుసరించు) [అల్-అన్ఆమ్: 90].

మరియు అన్ని మాటలలో, చేతలలో మరియు స్థితులలో ప్రవక్తను ఆదర్శంగా తీసుకోవాలని ముస్లిం సమాజానికి మార్గదర్శకత్వం చేశాడు. అల్లాహ్ సుభానహు వతఆలా ఇలా సెలవిచ్చాడు:

{لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ لِمَنْ كَانَ يَرْجُو اللَّهَ وَالْيَوْمَ الْآخِرَ وَذَكَرَ اللَّهَ كَثِيرًا} [الأحزاب: 21]

(నిశ్చయంగా అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని ఆశించేవారికీ, మరియు అల్లాహ్ ను ఎక్కువగా స్మరించుకునేవారికీ అల్లాహ్ ప్రవక్తలో ఒక ఉత్తమమైన ఆదర్శం ఉంది) [అల్-అహ్జాబ్: 21].

ఇది సమాజ నిర్మాణంలో మంచి ఆదర్శం ఉండటం ఒక ప్రధాన స్థంభం అని, మరియు ఇతరులకు ప్రయోజనం చేకూర్చే సత్శీలురైన వ్యక్తులను తయారు చేయడంలో ఇదొక ముఖ్యమైన కారణం అని సూచిస్తుంది.

**ఓ భాగ్యవంతుల్లారా!**

పిల్లల పెంపకానికి సంబంధించిన అత్యంత విజయవంతమైన సాధనాలలో ఖచ్చితంగా ఇవి ఉన్నాయి: పిల్లల ఆసక్తులపై అవగాహనతో కూడిన పర్యవేక్షణ, వారి మనసులను ఆక్రమించే విషయాలను అర్థం చేసుకోవడం, మరియు వారి మధ్య ఉన్న అడ్డంకులు తొలగిపోయేలా, చర్చించేటప్పుడు వారు భద్రతా భావాన్ని పొందేలా వారితో సంభాషణల తలుపులు తెరవడం. తద్వారా తండ్రి లేదా తల్లి ఒక సంరక్షకుడిగా మాత్రమే కాకుండా స్నేహితుని రూపంలో, ఒక బాధ్యతాయుతమైన వ్యక్తి సహచరుని రూపంలో ఉంటారు. వారు గౌరవాన్ని మరియు ప్రేమను, మార్గదర్శకత్వాన్ని మరియు ఆదరణను సమన్వయం చేసుకుంటారు. ప్రవక్త ఇబ్రాహీమ్ మరియు వారి కుమారుడు ఇస్మాయీల్ (అలైహిముస్సలామ్) ల మధ్య జరిగిన ఈ సంభాషణను పరిశీలించండి:

{فَلَمَّا بَلَغَ مَعَهُ السَّعْيَ قَالَ يَابُنَيَّ إِنِّي أَرَى فِي الْمَنَامِ أَنِّي أَذْبَحُكَ فَانْظُرْ مَاذَا تَرَى قَالَ يَاأَبَتِ افْعَلْ مَا تُؤْمَرُ سَتَجِدُنِي إِنْ شَاءَ اللَّهُ مِنَ الصَّابِرِينَ} [الصافات: 102]

ఆ బాలుడు అతనితో పాటు పరుగెత్తే వయస్సుకు చేరుకున్న తరువాత (ఓరోజు) ఇబ్రాహీం అతనితో "బాబూ! నేను నిన్ను జిబహ్ చేస్తున్నట్లు కలగన్నాను. దీనిపై నీ అభిప్రాయం ఏమిటో చెప్పు" అన్నాడు. దానికి ఆ బాలుడు (ఏమాత్రం కంగారుపడ కుండా) "నాన్నా! మీకు దేన్ని గురించి ఆజ్ఞ ఇవ్వబడిందో దాన్ని నెరవేర్చండి. దైవచిత్త మయితే మీరు నన్ను సహనశీలిగా చూస్తారు" అని అన్నాడు. [అస్-సాఫాత్: 102].

మరియు యూసుఫ్ (అలైహిస్సలామ్) ఆ కల కన్నప్పుడు, తన అంతరంగాన్ని తన తండ్రికి తప్ప మరెవరికీ చెప్పలేదు; ఎందుకంటే రహస్యాలు కేవలం ఎవరి సమక్షంలో అయితే మనసు ప్రశాంతతను పొందుతుందో వారికే చెప్పబడతాయి:

{إِذْ قَالَ يُوسُفُ لِأَبِيهِ يَاأَبَتِ إِنِّي رَأَيْتُ أَحَدَ عَشَرَ كَوْكَبًا وَالشَّمْسَ وَالْقَمَرَ رَأَيْتُهُمْ لِي سَاجِدِينَ} [يوسف: 4]

(యూసుఫ్ తన తండ్రితో ఇలా అన్నాడు: "ఓ నా తండ్రీ! నిశ్చయంగా నేను పదకొండు నక్షత్రాలను, సూర్యుడిని మరియు చంద్రుడిని చూశాను, అవి నాకు సజ్దా చేస్తున్నట్లు నేను చూశాను") [యూసుఫ్: 4].

لَيْسَ الْيَتِيمُ مَنْ انْتَهَى أَبَوَاهُ مِنْ هَمِّ الْحَيَاةِ وَخَلَّفَاهُ ذَلِيلَا
إِنَّ الْيَتِيمَ هُوَ الَّذِي تَلْقَى لَهُ أُمًّا تَخَلَّتْ أَوْ أَبًا مَشْغُولَا

**"తల్లిదండ్రులను కోల్పోయినవా డు అనాథ కాదు; తల్లిదండ్రులు ఉన్నప్పటికీ తల్లి నిర్లక్ష్యం చేసి, తండ్రి తన పనుల్లో మునిగిపోయి, ఆప్యాయతకు దూరంగా పెరిగే బాలుడే నిజమైన అనాథ."**

ఓ అల్లాహ్! ముస్లిం పురుషులందరినీ, ముస్లిం స్త్రీలందరినీ క్షమించు; వారిలో బ్రతికి ఉన్నవారిని మరియు మరణించినవారిని కూడా.

మా ప్రభువా! మా నుండి కష్టాలను, మహమ్మారులను, నష్టాలను మరియు ఇబ్బందులను తొలగించు. మాపై నీ అనుగ్రహాలను నిరంతరం ప్రసాదించు, నీ ఆగ్రహాలను మా నుండి దూరం చేయి. మా మనసులను పవిత్రం చేయి, వాటిని పవిత్రం చేసేవారిలో నువ్వే అత్యుత్తముడవు.

మా ప్రభువా! మాకు ఇలలో మంచిని ప్రసాదించు, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు మరియు నరకాగ్ని శిక్ష నుండి మమ్ములను కాపాడు.

ఓ అల్లాహ్! మా అమీర్ (పాలకుడు) మరియు ఆయన యువరాజును నువ్వు ఇష్టపడే మరియు సంతృప్తి చెందే విషయాలలో విజయం చేకూరుచు. వారిద్దరి చేతులు పట్టుకుని పుణ్యకార్యాల వైపు, దైవభీతి వైపు నడిపించు. ఈ దేశాన్ని మరియు ముస్లింల దేశాలన్నింటిని సురక్షితమైన, ప్రశాంతమైన, సుభిక్షమైన మరియు సిరిసంపదలతో వర్ధిల్లే దేశంగా చేయుము.

**శుక్రవారం నమాజ్ కోసం నమూనా ఖుతాను తయారు చేసిన కమిటీ**